# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 14 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మరో ఇద్దరు అరెస్ట్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ బ్లాస్ట్ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మరో ఇద్దరు డాక్టర్లను అరెస్ట్ చేశారు. వీరు అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయానికి చెందినవారని పోలీసులు చెప్పారు. పోలీసులు చెప్తున్న విషయంపై అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయం స్పందించింది. అరెస్టయిన డాక్టర్లతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేసింది. దీంతో తాజా పరిణామం కీలకంగా మారింది. ఇక దర్యాప్తు బృందాలు వెతుకుతున్న బ్రెజా కారును ఇదే యూనివర్సిటీలోనే కనుగొన్నాయి. ఢిల్లీ బ్లాస్ట్‌కు హ్యుందాయ్-ఐ20 కారు కారణమని నిఘా సంస్థలు గుర్తించాయి. దీనిని నడిపింది డాక్టర్ ఉమర్ అని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తుతో ముడిపడి ఉన్న మారుతి బ్రెజా కారును పట్టుకునేందుకు అధికారులు తీవ్రంగా గాలించారు. ఇందులో భాగంగా సదరు కారును అల్-ఫలాహ్ యూనివర్సిటీలో గుర్తించినట్టు వారు చెప్పారు. ఢిల్లీ పేలుడు ఘటన అనంతరం అల్-ఫలాహ్ యూనివర్సిటీ పేరు విస్తృతంగా వినిపిస్తున్న విషయం విదితమే. పేలుడుతో సంబంధమున్న ఫరీదాబాద్ ఉగ్రనెట్‌వర్క్ కేసులో పోలీసులు దర్యాప్తు తీవ్రం చేశారు. ఇందులో భాగంగా టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధమున్న జమ్మూకాశ్మీర్ వైద్యుడు డాక్టర్ ముజఫర్‌పై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలంటూ వారు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టయ్యారు. వారిలో ఒకరు డాక్టర్ ఆదిల్ కాగా.. ఆయన సోదరుడే డాక్టర్ ముజఫర్. నిందితుల విచారణలో భాగంగా ఈయన పేరు బయటకు వచ్చింది. ఢిల్లీ బ్లాస్ట్ ఘటన అనంతరం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) విశ్వవిద్యాలయానికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

## పెట్టుబడిదారులకు
# ద్వారం హైదరాబాద్




- ‘భారత్ ఫ్యూచర్ సిటీ’తో కొత్త దిశలో తెలంగాణ
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి
- ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు లేవు
- సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో అమెరికా - భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్రస్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఢిల్లీలో జరిగిన అమెరికా - భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు లో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా, పెట్టుబడులకు మరియు పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ప్రధాన ద్వారం అని తెలిపారు. జీసీసీలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించిన ముఖ్యమంత్రి గారు, అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ భారత్‌లోనే అత్యాధునిక నగరంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరిగా హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు.


డ్రైపోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ORR-RRR మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. చైనా ప్లస్ వన్ మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని ముఖ్యమంత్రి గారు స్పష్టంచేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, తక్కువ ఖర్చుతో, సులభమైన వీసా విధానాల ద్వారా గ్లోబల్ సౌత్ విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను ఆహ్వానించారు.

భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని, హైదరాబాద్‌లో ఆ ట్రెండ్‌ను మార్చాలని తాము అనుకుంటున్నామని, ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థల పేర్లను ఇవ్వాలన్న ఆలోచన ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు.

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి గారి లక్ష్యానికి, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ కు సదస్సులో విశేష స్పందన లభించింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరిస్తూ సాగిన ముఖ్యమంత్రి గారి ప్రసంగం అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించదగినదిగా ఉందని, తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలు, భవిష్యత్ ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉన్నాయని టెక్ దిగ్గజం సిస్కో మాజీ సీఈఓ జాన్ ఛాంబర్స్ గారు ప్రశంసించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు USISPF సభ్యులలో అత్యధికులు డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు కు హాజరవుతారని, తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని %ఖుక్ష్మీూౌఖీ% అధ్యక్షుడు డాక్టర్ ముఖేష్ ఆఘీ తెలిపారు.

## ఢిల్లీ పేలుళ్ల కేసులో కీలక మలుపు

- ఎనిమిది మందితో టెర్రర్ మాడ్యూల్..
- నాలుగు ప్రదేశాల్లో ఘోర దాడి ప్రణాళిక



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దేశ రాజధానిలో ఉగ్ర దాడి కుట్రకు సంబంధించిన మరో కీలక కోణం వెలుగులోకి వచ్చింది. ఎర్రకోట పేలుడు కేసులో నిందితులుగా ఉన్న ఎనిమిది మందితో కూడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ నాలుగు ప్రాంతాల్లో వరుస దాడులు చేయాలని ప్రణాళిక వేసినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. వీరు ఇద్దరేసి సభ్యులతో రెండు బృందాలుగా ఏర్పడి, ప్రతి గ్రూప్ మల్టిపుల్ ఐడీలతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది.

డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ ఆదిల్, ఉమర్, షాహిన్‌లు కలిసి సుమారు రూ.20 లక్షలు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కి అప్పగించారు. ఆయన గురుగ్రామ్, నుహ్ ప్రాంతాల నుంచి రూ.3 లక్షల విలువైన 20 క్వింటాళ్ల ఎన్‌పీకే (నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం) ఫర్టిలైజర్లు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. వీటిని పేలుడు పదార్థాల తయారీకి వినియోగించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఉమర్ సిగ్నల్ యాప్‌లో ఇద్దరు, నలుగురితో కూడిన గ్రూప్‌ను సృష్టించి, దాడి ప్రణాళికలు చర్చించినట్లు సమాచారం. డాక్టర్ ముజమ్మిల్‌తో ఆర్థిక విభేదాలు ఉన్నప్పటికీ, టెర్రర్ యాక్టివిటీలు మాత్రం ఆగలేదని అధికారులు పేర్కొన్నారు.

**డిసెంబర్ 6న 26/11 తరహా దాడి ప్లాన్**

బాబ్రీ మసీదు కూల్చివేత వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 6న 2008 ముంబయి దాడుల మాదిరిగా దేశాన్ని కుదిపేయాలనే ఉద్దేశంతో ఉమర్ ఘోర దాడి ప్రణాళిక వేసినట్లు తేలింది. ఇందుకోసం పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ చేశారని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఫరీదాబాద్‌లో అరెస్టయిన ఎనిమిది మందిని విచారించినప్పుడు ఈ కుట్ర బహిర్గతమైంది. దేశంలో అత్యంత ప్రాముఖ్యమైన ప్రదేశాలైన ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీ శంకర్ ఆలయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఈ మాడ్యూల్ సభ్యులు దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌లో కూడా దాడులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తేలింది. ఫరీదాబాద్‌కు చెందిన డాక్టర్ ముజమ్మిల్ గనై ఈ ఏడాది జనవరిలో ఎర్రకోట పరిసరాల్లో పలు మార్లు రెక్కీ చేసినట్లు మొబైల్ డేటా విశ్లేషణలో తేలింది.

జనవరి తొలివారాల్లో ముజమ్మిల్, ఉమర్ ఎర్రకోట ప్రాంతాల్లో ఉన్నట్లు మొబైల్ లొకేషన్ డేటా నిర్ధారించింది. భద్రతా ఏర్పాట్లు, జనసంచారం పరిశీలన కోసం పలుసార్లు అక్కడికి వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలు చెబుతున్నాయి. ఇద్దరి పాస్‌పోర్టుల్లో తుర్కియే ఇమ్మిగ్రేషన్ స్టాంపులు గుర్తించడంతో అంతర్జాతీయ లింకులు ఉన్నాయని అనుమానం వ్యక్తమవుతోంది. వారిద్దరూ విదేశీ హ్యాండ్లర్లను కలిశారా లేదా అన్నదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, తుర్కియే ప్రభుత్వం మాత్రం ఉగ్రవాద కార్యకలాపాల్లో తమ దేశానికి ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టంచేసింది. మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తలు సత్యదూరమని పేర్కొంది.

**ఢిల్లీ పేలుడు కేసులో మరో అరెస్ట్**

ఢిల్లీ ఉగ్రకుట్రకు సంబంధం ఉన్నట్లు భావిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో సంబంధం ఉన్న డీఎల్10సీకే0458 నంబర్ గల ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును గత వారం పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని ఖండవలి గ్రామంలో ఆ వాహనాన్ని గుర్తించారు. దానిని అక్కడ పార్క్ చేసిన వ్యక్తి ఫహీమ్ అని గుర్తించి, ఫరీదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ప్రస్తుతం నిఘా విభాగ అధికారులు విచారిస్తున్నారని సమాచారం. ఎర్రకోట వద్ద జరిగిన పేలుడుతో సంబంధం ఉన్న మరో కారు కోసం కూడా దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. గత సోమవారం సాయంత్రం తెలుపు రంగు హుందాయ్ ఐ20 కారుతో డాక్టర్ ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. మొత్తం మూడు వాహనాలను ఈ ఉగ్రకుట్రలో వినియోగించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ ఫరీదాబాద్‌లో లభించగా, ఇప్పుడు మూడో కారు ౨ మారుతీ బ్రీజా కోసం వేట సాగుతోంది. ఆ కారు ఎక్కడుందో ఇప్పటివరకు ఆచూకీ లభించలేదు. దాన్ని నిందితులు తప్పించుకునేందుకు వినియోగించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంతో పాటు ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ప్రత్యేక బృందాలు శోధన ప్రారంభించాయి. దర్యాప్తు సంస్థలు టోల్‌గేట్ సీసీటీవీ ఫుటేజ్, వాహనాల లొకేషన్ ట్రాకింగ్, ఫోన్ టవర్ డేటా ఆధారంగా ఆ కారును గుర్తించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

## ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి తెచ్చే దిశగా ప్రణాళిక

**- నష్టాల్లో ఉన్న డిపోలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్న మంత్రి పొన్నం ప్రభాకర్**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలను లాభాల్లోకి మార్చే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీసీ ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గురువారం నాడు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రి, సంస్థ ఆర్థిక పరిస్థితిపై సమీక్షించారు. సమావేశంలో మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్.. కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీలకు బస్సు రూట్లు పెంచే అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. అలాగే కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్‌ను రెండు సంవత్సరాలకు తగ్గించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలు - డ్రైవర్ మానిటరింగ్ సిస్టం

ఆర్టీసీకి అవసరమైన కొత్త డిపోల కోసం హైదరాబాద్ పరిధిలో స్థలాల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. అలాగే ఆరాంఘర్ బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చలు జరపాలని అధికారులకు సూచించారు. బస్సు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రైవర్ మానిటరింగ్ సిస్టం త్వరలో అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. “ఆర్టీసీ సిబ్బందే సంస్థ బలం. వారి అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం త్వరలో డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తాం” అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## టెట్ షెడ్యూల్ విడుదల

**జనవరి 3 నుంచి 31 వరకు పరీక్షలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) షెడ్యూల్ ను పాఠశాల విద్య సంచాలకులు, టీజీటెట్ చైర్‌పర్సన్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ విడుదల చేశారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ టెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.. శనివారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరిస్తా రు. ఈ నెల 29 వరకు టెట్‌కు దరఖాస్తు చేసుకు నేందుకు అవకాశం కల్పించారు. 2026 జనవరి 3 నుంచి 31 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ తప్పనిస రిగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు గతంలో ఇచ్చిన నిబంధనలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం టెట్ మినహాయింపును ఇవ్వగా, తాజాగా ఆ ఉత్తర్వులను విద్యాశాఖ సవరించింది. టెట్ పరీక్షను 2010 నుంచి నిర్వహిస్తూ వస్తున్నారు. 2010 తర్వాత నియామకమై న ఉపాధ్యాయులందరూ టెట్ ఉత్తీర్ణత సాధించారు. అంతకుముందు నియమితులై సర్వీసు కొనసాగుతున్న వారిలో కొందరు మాత్రమే టెట్ ఉత్తీర్ణత సాధించగా, మరికొందరు సాధించాల్సి ఉన్నది. కాగా, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని సుప్రీంకోర్టు సెప్టెంబర్ 1న తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేండ్లలో అంటే 2027 నాటికి ఉత్తీర్ణులు కావాలని స్పష్టం చేసింది. అయితే ఐదేండ్లలో పదవీ విరమణ చేయబోయేవారికి మాత్రమే టెట్ అవసరం లేదని మినహాయింపునిచ్చింది. అయితే వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసి, టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా చొరవ తీసుకోవాలని

## కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం



- జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్ కు సర్వం సన్నద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు. శుక్రవారం ఎన్నిక కౌంటింగ్ నేపథ్యంలో గురువారం యూసఫ్ గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోనీ మీడియా సెంటర్ లో పాత్రికేయులకు కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చేస్తామన్నారు. నోటా తో కలిపి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఈసీఐ నుండి ప్రత్యేక అనుమతి తీసుకుని ఈ సారి 42 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గరిష్టంగా 10 రౌండ్ లు చేస్తారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియను ఈసీఐ సాధారణ పరిశీలకులు , ఈసీఐ బృందం పరిశీలిస్తారని చెప్పారు.

కౌంటింగ్ ప్రక్రియకు 186 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్ లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ ఉంటారని అన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా, ఈసీ యాప్ ద్వారా అప్డేట్ ఇస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు, కౌంటింగ్ ఏజెంట్ లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు. జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. కౌంటింగ్ కోసం ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, రేపు కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 10 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఉదయం 8:45 గంటలకు తొలి రౌండ్ ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి, 144 సెక్షన్ విధించారు. సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- వచ్చే నెలలో ఆర్టీసీలో మరో నోటిఫికేషన్
- 198 పోస్టుల భర్తీకి రెడీ అవుతోన్న ప్రభుత్వం
- మంత్రి పొన్నం శుభవార్త

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ శుభవార్త తెలిపారు. వచ్చే నెల అంటే డిసెంబర్‌లో మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఆర్టీసీలో 1000 డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నియామక ప్రక్రియను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ఈ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూ దశ కొనసాగుతోందని, నియామకాలు వేగంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. “ప్రతి నియామకం న్యాయంగా, ఎవరికీ అన్యాయం జరగకుండా ఉంటుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం” అని ఆయన పేర్కొన్నారు.

## ఇల్లు కూలి కూలీల మృతి

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**

పాత భవనాన్ని కూల్చేస్తున్న సమయంలో ఇల్లు కూలి కూలీలపై పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు, సీఐ అప్పయ్య సమాచారం ప్రకారం.. యజమాని లక్ష్మణ్ తన ఇంటికి మరమ్మతులు చేసేందుకు కూలీలను పిలిపించాడు. ఇంటికి ఆనుకొని ఉన్న రాగి చెట్టును తొలగిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇల్లు కూలిపోయింది. అందులో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. పాత ఇల్లు కావడం వల్ల సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికీ ఆటంకాలు ఎదురవుతున్నాయి. మృతిచెందిన కార్మికుల వివరాలు ఇంకా తెలియలేదు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయబోయిని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత భవనం కావడం.. యజమాని తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా.. చట్టం పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పట్టణంలో పురాతన భవనాలు, వర్షం వల్ల దెబ్బతిన్న భవనాలను గుర్తించి వెంటనే కూల్చేయాలని, అక్కడి కుటుంబాలను తరలించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఇంటి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## కామారెడ్డిలో బాలికపై లైంగికదాడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాయమాటలు చెప్పి బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ భార్గవ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌పై అదే గ్రామానికి చెందిన యువకుడు నాలుగు నెలలుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను బెదిరించాడు. బాలిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మెదక్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు బాలిక మూడు నెలల గర్భవతి అని తెలపడంతో దిక్కుతోచని స్థితిలో నాగిరెడ్డిపేట్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.

## అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెర

**ట్రంప్ సంతకంతో ఫండింగ్ బిల్లు ఆమోదం**



**బలగం టీవీ, వాషింగ్టన్**

అగ్రరాజ్యం అమెరికా చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగిన లిలిప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడింది. దాదాపు 43 రోజుల పాటు కొనసాగిన షట్‌డౌన్‌కు తెరపడేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై సంతకంలిలి చేశారు. అంతకుముందు రిపబ్లికన్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల సభలో 222-209 తేడాతో బిల్లు ఆమోదం పొందగా, ఆ వెంటనే అధ్యక్షుడు ట్రంప్ తన సంతకం చేశారు. దీంతో సుదీర్ఘ షట్‌డౌన్ అధికారికంగా ముగిసింది. మూడు రోజుల క్రితమే ఈ బిల్లుకు సెనేట్ ఆమోదంలిలి లభించిన విషయం తెలిసిందే. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన లిలిఫెడరల్ నిధుల బిల్లుకు ఆమోదం లభించకపోవడంతోలిలి అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించింది.

సెప్టెంబర్ 30 అర్ధరాత్రి (అమెరికా కాలమానం ప్రకారం 11:59 నిమిషాలు) వరకు బిల్లుకు ఆమోదం లభిస్తుందని భావించినా, డెమోక్రాట్లు వెనక్కి తగ్గకపోవడంతో ట్రంప్ ప్రభుత్వం షట్‌డౌన్‌ను ప్రకటించింది. సెనేట్‌లో రిపబ్లికన్లకే అధికారం ఉన్నప్పటికీ, డెమోక్రాట్ల వ్యతిరేకతతో బిల్లు ఆమోదం పొందలేదు. ఫలితంగా వైట్‌హౌజ్ నిరవధికంగా షట్‌డౌన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈసారి షట్‌డౌన్ లిలిఅమెరికా చరిత్రలోనే సుదీర్ఘమైనదిలిలి. దాదాపు లిలి43 రోజుల పాటు ప్రభుత్వం స్థంభించడంతోలిలి లక్షలాది మంది అమెరికన్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ప్రభుత్వ శాఖల మూతపడటంతో లిలివిమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న లిలిఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో గైర్హాజరులిలి కావడంతో పలు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. లిలి పరిమిత సిబ్బందిపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం విమాన సేవల్లో కోత విధించాల్సి వచ్చింది.

## బాలలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ జయంతి సందర్భంగా సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి బాలలకు శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలలను జాతి సంపదగా భావించి, వారి మెరుగైన భవితవ్యానికి కృషి చేయాలని సూచించారు. నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజాప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. చదువుతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని తెలిపారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని భరోసా ఇచ్చారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో భారీ అగ్ని ప్రమాదం

- రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫైళ్లు పూర్తిగా దగ్ధం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో గురువారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే ఫైళ్లు, ఫర్నీచర్ దగ్ధమవ్వడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. తీవ్ర భయాందోళనకు గురైన ఉద్యోగులు బయటకు పరుగులు పెట్టారు. అదే సమయంలో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న 8 మంది సిబ్బంది దట్టమైన పొగ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది కూడా ఫైరింజిన్‌లతో ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఫైళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రెవిన్యూ రికార్డులకు సంబంధించిన విలువైన సమాచారం కాలి బూడిదైంది. ప్రాణ నష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు.. ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు జీహెచ్‌ఎంసీలో రెవెన్యూ విభాగం ముఖ్యమైనది కావడంతో అగ్నిప్రమాదంపై అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## మటన్ ముక్క గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి

**బలగం టీవీ, నాగర్‌కర్నూల్**

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. భోజనం చేస్తుండగా ఓ వ్యక్తి గొంతులో మటన్ ముక్క ఇరుక్కోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే బొందలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య (45) ఇంట్లో మటన్ తింటుండగా ఒక్కసారిగా ముక్క గొంతులో ఇరుక్కుంది. ఊపిరి ఆడక సతమతమవుతున్న అతనిని కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.

## గేటు మీద పడి బాలుడు మృతి

వివరాలు 2వ పేజీలో

# బాల్య వివాహాల రహిత జిల్లాగా నిలవాలి..



- **బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి..**
- **గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలి..**
- **రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన**
- **హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బాల్య వివాహాల రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన పేర్కొన్నారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, అమలవుతున్న పథకాలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాల్య వివాహాలు, బాల కార్మికుల కేసులు, వారి హక్కుల పరిరక్షణ తీసుకుంటున్న చర్యలు, వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన మాట్లాడుతూ.. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మికుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారిని సమీప విద్యాలయాల్లో చేర్పించాలని, అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లలను రెసిడెన్షియల్ స్కూళ్లలో జాయిన్ చేయాలని సూచించారు. విద్యాలయాలు, హాస్టల్ లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై, 1098 హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులను విద్యా ద్వారా సామాజికంగా, ఆర్థికంగా రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని, సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని, చిల్డ్రన్ హెూమ్ పనులు పూర్తి చేయిస్తామని, పిల్లల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీ వీహెచ్ఓ రవీందర్ రెడ్డి, డీఈఓ వినోద్ కుమార్, డీఎస్పీ చంద్ర శేఖర్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జీసీడీఓ పద్మజ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య..

**బలగం టీవీ, హన్మకొండ**



మూడు పదుల వయసు దాటినా పెళ్లి కావడం లేదనే తీవ్ర మనస్తాపంతో హన్మకొండ జిల్లాకు చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడు హన్మకొండ జిల్లా, ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన బూర నరేష్ (32) గా గుర్తించారు. నరేష్ తల్లిదండ్రులు బూర సురేందర్, రమ దంపతులు గత నాలుగేళ్లుగా అతనికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. నరేష్ హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో ఒక బట్టల షాపులో పని చేస్తున్నాడు. ఈ ఉద్యోగం కారణంగా పిల్లను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదనే ఆవేదనతో నరేష్ గత కొన్ని రోజులుగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెందిన నరేష్ ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో నరేష్ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్పీకర్‌పై బీఆర్ఎస్ కోర్టు ధిక్కరణ పిటిషన్..

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సోమవారం సుప్రీంలో విచారణ..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణకు సంబంధించి సుప్రీంకోర్టులో సోమవారం నాడు కీలక విచారణ జరగనుంది. ఈ కేసులకు సంబంధించిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు ఒకే రోజు విచారించనుంది. ఈ సందర్భంగా, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోకపోవడంపై బీఆర్ఎస్ ఈ పిటిషన్‌ను వేసింది. మరోవైపు, ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణకు సంబంధించి మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం తరపున కూడా సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకోకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. స్పీకర్ కార్యాలయం సమయం కోరడం, బీఆర్ఎస్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయడం వంటి పరిణామాల నేపథ్యంలో, సోమవారం సుప్రీంకోర్టులో జరిగే విచారణ ఉత్కంఠగా మారింది.

# లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలి..

- **వ్యవసాయం, విద్య, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరు చేయాలి..**
- **ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలి**
- **డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య రుణాలు ప్రస్తుతం 50 శాతం పూర్తి చేయాలని, ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా 100 శాతం చేయాలని సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రుణం ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్ ల్లో వినియోగంలో లేని ఖాతాల వివరాలు ఖాతాదారులకు తెలుపాలని, కేవైసీ అప్డేట్ చేయించాలని సూచించారు. వచ్చేనెల 31వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

బ్యాంక్ లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. 1930 / 1945 టోల్ ఫ్రీ నంబర్ పై వివరించాలని, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై సమీక్ష చేశారు. నాబార్డ్ అందించే వివిధ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి, ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సహావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ డీజీఎం అపర్ణ రెడ్డి, ఎస్బీఐ ఏజీఎం వెంకటేష్, ఆయా బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గేటు మీద పడి బాలుడు మృతి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేటలో మానవ హృదయాలను కలిచివేసే ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న భవనం ముందు భారీ ఇనుప గేటు ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఏడేళ్ల పసివాడు ఆకాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామానికి చెందినవాడు. అతని తాత, అమ్మమ్మలు అక్కడ భవనానికి వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్నారు. ఆకాష్ నిన్న వారిని చూడటానికి బౌరంపేటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఉదయం ఇంటి ఎదుట ఆడుకుంటూ గేటు దగ్గరికి వెళ్లిన బాలుడిపై భారీ ఇనుప గేటు అకస్మాత్తుగా పడిపోవడంతో అతని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. స్థానికులు బిల్డర్ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రతి సారి ఇలాంటి ఘటనల తర్వాత డబ్బుతో సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ఒక ప్రాణం పోతే డబ్బుతో తిరిగి వస్తుందా?" అంటూ మండిపడ్డారు. భవన నిర్మాణాల్లో భద్రతా చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యం చూపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి బ్రేక్..!

- **టీ హబ్‌గా మార్చే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం?**
- **వైద్య సేవలకు గండి**



**బలగం టీవీ, వరంగల్:**

ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. 2,200 పడకలు, 24 అంతస్తులతో నిర్మించతలపెట్టిన ఈ భారీ ఆసుపత్రి భవనాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు వైద్య శాఖ అధికారులలో చర్చ నడుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ఆమోదం తెలిపి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టింది. సుమారు 80% భవన నిర్మాణ పనులు పూర్తయినట్లు సమాచారం. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా అత్యాధునిక వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈ 'హెల్త్ సిటీ' ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా, మిగిలిన 20% పనులు కూడా పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ జాప్యం వల్ల ఆసుపత్రి నిర్మాణం నిలిచిపోయి, లక్షలాది మంది ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందడం ఆలస్యం అవుతోంది. తాజాగా, ఈ అసంపూర్తి ఆసుపత్రి భవనాన్ని ఐటీ హబ్ గా మార్చాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్లు వైద్య శాఖలోని కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు.

# ఏసీబీ వలలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి

**బలగం టీవీ, రంగారెడ్డి**



ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో అవినీతి ముసుగు చెదిరిపోయింది. గురువారం ఏసీబీ అధికారులు సడన్ సోదాలు నిర్వహించి ఇద్దరు అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సమాచారం ప్రకారం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్, అసిస్టెంట్ వంశీ కలిసి ఒక పౌరుని నుంచి రూ.75 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇల్లు నిర్మాణ అనుమతి (బిల్డింగ్ పర్మిషన్) నిమిత్తం ఈ డబ్బు వసూలు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. సాక్ష్యాలతో పాటు లంచం మొత్తం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయంలో కలకలం రేగింది.



## శ్రీ చైతన్య స్కూల్లో స్పోర్ట్స్ మీట్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్..

- **శ్రీ చైతన్య స్కూల్లో క్రీడా సంబరాలు:**

**డా. బీ.ఎస్. రావు స్మారక స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో డాక్టర్ బి.ఎస్ రావు గారి జ్ఞాపకార్థం నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం అంబరాన్నంటింది. ఈ క్రీడా వేడుకలకు ముఖ్యఅతిథిగా వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఎస్. రావు గారి స్మారకార్థం ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ క్రీడా సంబరాల్లో విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో చాలా ముఖ్యం. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు, నాయకత్వ లక్షణాలను, టీమ్ స్పిరిట్‌ను నేర్పుతాయి. విద్యార్థులు ఓటమిని అంగీకరించడం, విజయాన్ని గౌరవించడం నేర్చుకోవాలి. శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడం అభినందనీయం." అనంతరం ఆయన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్-పాస్ట్, రంగురంగుల సాంస్కృతిక ప్రదర్శనలు మరియు సాహసోపేత విన్యాసాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## పార్టీ పరంగా రిజర్వేషన్లు వద్దు.. చట్టపరంగానే రిజర్వేషన్లు ముద్దు

- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు**
- **సిరిసిల్ల అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీల ధర్మ పోరాట దీక్ష..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజకీయ పార్టీల పరంగా కాకుండా చట్టపరంగానే బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీపరమైన రిజర్వేషన్లు వద్దని, చట్టపరంగా రిజర్వేషన్లే ముద్దని ఆయన స్పష్టం చేశారు.గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం చేపట్టిన బీసీల ధర్మ పోరాట దీక్షకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా 42 శాతం రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో పనిచేసిందని, బీసీ కులగణన చేసి, అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతికి, గవర్నర్‌కు పంపిందని పర్ష హన్మాండ్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టు వీడని విక్రమార్కుల్లా చిత్తశుద్ధితో ఉడుంపట్టు పట్టి ఇంతవరకు తీవ్రంగా శ్రమించిందని అయితే ఈ రెండు మూడు రోజులగా కాంగ్రెస్ పార్టీ నాయకుల స్వరంలో మార్పు కనిపిస్తోందని, కాబట్టి పార్టీ పట్టు సడలించకుండా, మాట మార్చకుండా లక్ష్యం సాధించేవరకు పట్టుదలతో ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తలుచుకుంటే, 42 శాతం రిజర్వేషన్లు ఒక్కరోజులోనే సాకారం అవుతాయని ఆయన అన్నారు. గతంలో తెలంగాణ బిల్లుకు బీజేపీ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు బీజేపీ బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే, కాంగ్రెస్ మరియు ఇండియా సంబంధించిన పార్టీలు పార్టీలు మద్దతు ఇస్తాయని, తద్వారా రిజర్వేషన్లు సాధించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఉద్యమం ఉధృతమైందని, మొన్నటి తెలంగాణ బంద్‌కు అధికార, ప్రతిపక్షాల మద్దతు కూడగట్టి విజయవంతం చేశామని పర్ష హన్మాండ్లు పేర్కొన్నారు.

వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు పెట్టి ఆమోదించాలి. రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి. రాజకీయ పార్టీలు స్పందించకపోతే పార్లమెంటును ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఎంతకైనా తెగిస్తామని, చివరికి ప్రాణ త్యాగానికైనా సిద్ధమని, ప్రాణ త్యాగం చేసైనా రిజర్వేషన్లు సాధించి తీరుతామని పర్ష హన్మాండ్లు ఉద్ఘాటించారు. ఈ బీసీల ధర్మ పోరాట దీక్షలో బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ముదిరాజ్, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రతినిధి బండారి బాల్ రెడ్డి, కుమ్మరి శాలివాన సంఘం జిల్లా అధ్యక్షుడు రాధారపు శంకర్, గౌడ సంఘం జిల్లా ప్రతినిధి కందుకూరి రామాగౌడ్, యాదవ సంఘం జిల్లా ప్రతినిధి రాములు యాదవ్, రజక సంఘం జిల్లా ప్రతినిధి కంచర్ల రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రతినిధి ఇల్లంతకుంట తిరుపతి, నాయకులు పంబాల దేవరాజు, ఏలూరి చంద్రకాంత్, సరుగు నరేష్ ముదిరాజ్, మల్లయ్య పటేల్, అనిల్ గౌడ్, బోయిన శ్రీనివాస్, తోట్ల మల్లేశం యాదవ్, సామల తిరుపతి, కొండ విజయకుమార్, దుబాల కొండయ్య, ఇతర బీసీ సంఘాల నాయకులు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో సేవలపై విస్తృత అవగాహన కల్పించాలి..

- **పౌష్టికాహారం ఇవ్వాలి.. ఉత్తమ సేవలు అందించాలి..**
- **మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్..**
- **హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అంగన్వాడీ కేంద్రాల్లో అందించే అన్ని సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి కార్యదర్శి అనిత రామచంద్రన్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలో పోషణలోపంతో బాధపడుతున్న వారి వివరాలు అధికారులను తెలుసుకున్నారు. పోషణ లోపంతో బాధపడుతున్న వారికి అందించాల్సిన సేవల గురించి అందుతున్న సేవల స్థితిగతులపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆహార పదార్థాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అనేది పరిశీలించారు. అలాగే సూపర్వైజర్ లను అడిగి వారి సమస్యలపై ఆరా తీశారు. అంగన్వాడీలలో పిల్లల హాజరు శాతం పెంచడానికి చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి వారం ఎగ్ బిర్యానీ పెట్టాల్సిందిగా ఆదేశించారు.

అలాగే గర్భిణీలకు ప్రతి అంగన్వాడికి రెండు చొప్పున బెంచీలు అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పోషన్ ట్రాకర్, ఎన్ హెచ్ టి ఎస్ అప్ లలో లబ్ధిదారుల సంఖ్యను పోల్చి చూసి పరిశీలించారు. సఖి ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే అందరూ వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి నైపుణ్య శిక్షణ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. బాల్యవివాహాలు జరగకుండా గ్రామాలలో భేటీ బచావో బేటి పడావో ద్వారా ప్రత్యేక కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులపై ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీ లను ఏర్పాటు చేయాలని, వారందరికీ చట్టం పైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులకు వయోవృద్ధులకు ఉపకరణాలు పరికరాలు అందించాలని సూచించారని తెలిపారు. ఎంతో శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

అలాగే ప్రస్తుతం జరిగిన క్యాంపుల వివరాలను పరిశీలించి విజయవంతం కావడానికి కృషిచేసిన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోతున్న డేకేర్ సెంటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు, వయోవృద్ధులందరికీ పరికరాలు అందించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి వారికి ఎలాంటి వసతులు అందుతున్నాయి అని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి ఝాన్సీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, సిడిపివోలు ఉమారాణి, సౌందర్య, డిహబ్ కోఆర్డినేటర్ రోజా, డిసిపిఓ కవిత, సఖి కోఆర్డినేటర్ మమత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి..



- **అన్ని అమ్మకాలు రైతు బజార్లో జరగాలి..**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు.

**నిర్వహణ సక్రమంగా చేపట్టాలి..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

**రైతు బజార్ లోనే విక్రయాలు చేయాలి..**

సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో ఇక్కడే చేసేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకలకు హాజరైన చల్మెడ..

**బలగం టీవీ, వేములవాడ**

బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వేములవాడ పట్టణంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ కుమారుడి వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

అలాగే, మొదటి బైపాస్ రహదారిలో గల హరిహర ఫంక్షన్ హాల్లో వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త లింగంపల్లి రాములు కుమారుడి వివాహం జరిగింది. చల్మెడ గారు ఈ వేడుకకు కూడా హాజరై నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు.వారి వెంట పట్టణ మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేష్, నాయకులు రామారావు, నీరటి మల్లేశం, వాసాల శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు పెండ్యాల తిరుపతి, పెండ్యాల శంకర్, అంజనీ కుమార్, పొత్తూరి జనార్ధన్, గసికంటి తిరుపతి,



సముద్రాల దేవరాజు, షఫీ, ఊరడి బాపురెడ్డి తదితరులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు.

# టెస్ట్ సిరీస్‌కు వేళాయే

- నేటి నుంచి భారత్ దక్షిణాఫ్రికా మొదటి టెస్ట్
- ప్లేయింగ్‌లో జూరెల్ ఖాయం
- నితీష్ అవుట్

బలగం టీవీ, హైదరాబాద్

దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ టెస్ట్ సిరీస్‌తో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించ బోతోంది. మొదటి టెస్ట్ శుక్రవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో లిలిఅక్షర్ పటేల్ స్థానంలో మార్పులిలి రావొచ్చని జట్టు వర్గాలు తెలిపాయి. యువ ఆటగాడు లిలిధ్రువ్ జురెల్‌లిలి ఆడటం దాదాపు ఖాయం కాగా, అతడితో పాటు లిలిరిషబ్ పంత్‌లిలి కూడా జట్టులో ఉంటారని సహాయక కోచ్ ధృవీకరించారు.

ఇంగ్లాండ్ పర్యటనలో గాయపడ్డ రిషబ్ పంత్ పూర్తిగా కోలుకుని దాదాపు మూడు నెలల తర్వాత తన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌కు సిద్ధమయ్యాడు. దాంతో కోల్‌కతా టెస్ట్‌లో భారత్ మూడు ఫాస్ట్ బౌలర్లు, రెండు స్పిన్నర్ల కాంబినేషన్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది.





నితీష్ కుమార్ రెడ్డి మొదటి టెస్ట్ నుంచి తప్పించబడ్డాడు. గాయ కారణం కాకుండా జట్టులో కాంబినేషన్ మార్పుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. అతను దక్షిణాఫ్రికా ఎ జట్టుతో రాజ్‌కోట్‌లో జరిగే వన్డే సిరీస్‌లిలి కోసం భారత్ ఎ జట్టులో చేరనున్నాడు. ఆ సిరీస్ ముగిసిన తర్వాత రెండో టెస్ట్‌కు తిరిగి జట్టులోకి వస్తాడు.భారత్ సహాయక కోచ్ రయాన్ టెన్ డోషెట్ మాట్లాడుతూ, "ధ్రువ్ జురెల్ దక్షిణాఫ్రికా ఎ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రెండు సెంచరీలు సాధించాడు. అతను ఫామ్‌లో ఉన్నాడు, ఈ వారం ఖచ్చితంగా ఆడతాడు" అని పేర్కొన్నారు.

రిషబ్ పంత్ మరియు ధ్రువ్ జురెల్ ఇద్దరూ ప్లేయింగ్ 11లో ఉంటే, వికెట్ కీపింగ్ బాధ్యతలను పంత్ తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందని జట్టు వర్గాలు తెలిపాయి. పంత్ పూర్తిగా ఫిట్‌గా లేకుంటే, జురెల్ గ్లోవ్స్ ధరించే అవకాశమూ ఉంది.

భారత్–దక్షిణాఫ్రికా మొదటి టెస్ట్ ప్రత్యక్ష ప్రసారం స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లిలిలో అందుబాటులో ఉంటుంది. లైవ్ స్ట్రీమింగ్ లిలిజియోహాట్‌స్టార్ యాప్‌లిలి మరియు వెబ్‌సైట్ ద్వారా వీక్షించవచ్చు.

# పాస్ ఉన్నవారే 'గ్లోబల్ ట్రాటర్' ఈవెంట్‌కు రావాలి

## రాజమౌళి వీడియో విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా దర్శక ధీరుడు రాజమౌళి రూపొందిస్తున్న కొత్త చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఆర్ఆర్ఆర్' తర్వాత జక్కన్న తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్‌లిలి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మహేష్ బాబు ప్రీ లుక్ పోస్టర్‌తో పాటు, ఇతర పాత్రధారుల ఫస్ట్ లుక్స్ విడుదల కావడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. తాజాగా ఈ చిత్ర బృందం టైటిల్ రివీల్ ఈవెంట్ కోసం సన్నాహాలు పూర్తి చేసింది.

ఈ నెల నవంబర్ 15న సాయంత్రం 6 గంటలకు రామోజీ ఫిల్మ్ సిటీలో 'గ్లోబల్ ట్రాటర్' పేరుతో గ్రాండ్ ఈవెంట్‌లిలి నిర్వహించనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో జక్కన్న మాట్లాడుతూ, ఈవెంట్‌కు లిలిఫిజికల్ పాస్ ఉన్నవారికే ప్రవేశంలిలి ఉంటుందని స్పష్టం చేశారు. పాస్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా రూట్ మ్యాప్, ఇన్‌స్ట్రక్షన్స్ పొందవచ్చని తెలిపారు. అలాగే 18 ఏళ్లలోపు పిల్లలు, సీనియర్ సిటిజన్లు ఈ కార్యక్రమానికి హాజరుకావద్దని, వారు ఇంట్లో నుంచే లైవ్ ద్వారా వీక్షించాలని సూచించారు. ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా ఈవెంట్ రద్దు చేసే అవకాశం ఉందని పోలీసు కమిషనర్ హెచ్చరించారని రాజమౌళి వెల్లడించారు. భద్రత, సౌకర్యాల పరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# 'రాజు వెడ్స్ రాంబాయి' ట్రైలర్ విడుదల..




## ప్రేమతో పాటు సందేశం కూడా

బలగం టీవీ, హైదరాబాద్

ప్రేమకథా చిత్రాలు ప్రేక్షకులను ఎప్పుడూ ఆకట్టుకుంటూనే ఉంటాయి. అదే జానర్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. దర్శకుడు సాయిలు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అఖిల్ ఉడ్డెమారిలిలి, తేజస్వి (కమిటీ కుర్రోళ్లు ఫేమ్) హీరో, హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈటీవీ ఒరిజినల్ మూవీలిలిగా రూపొందిన ఈ చిత్రం నవంబర్ 21నలిలి థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు.

ట్రైలర్ ప్రారంభం హీరో రాజు బ్యాండ్ బాజా మోగించే సీన్లతో మొదలవుతుంది. "రాజు నువ్వెప్పుడు బ్యాండ్ కొడుతూనే ఉండు... మనకు పెళ్లైనా, పిల్లలు పుట్టినా, మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతూనే ఉండు సరేనా" అంటూ హీరోయిన్ చెప్పే డైలాగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. బ్యాండ్ కొట్టి జీవనం సాగించే రాజు అనే యువకుడి జీవితంలోకి చదువుకునే రాంబాయి అనే అమ్మాయి అడుగుపెట్టిన తర్వాత జరిగే పరిణామాల చుట్టూ కథ తిరుగుతుంది. ప్రేమ, పెళ్లి, వాటి ద్వారా ఎదురయ్యే జీవిత సవాళ్లను చూపుతూ యూత్‌కి ఆలోచింపజేసేలా సినిమా తెరకెక్కినట్టు ట్రైలర్ హింట్ ఇస్తోంది. ఈ చిత్రానికి 'విరాటపర్వం' దర్శకుడు వేణు ఊడుగుల వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుండటం మరో విశేషం.

# కొండా సురేఖ కేసు.. నాగార్జున కేసు విత్‌డ్రా

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. ఈ వివాదంపై నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం దావా నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణకు రావాల్సి ఉండగా, కోర్టులో హాజరు కాకముందే నాగార్జున తన కేసును విత్‌డ్రా చేసుకున్నాడు. విచారణకు ఒక రోజు ముందు కొండా సురేఖ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, గతంలో నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసి క్షమాపణలు తెలిపారు. "నా వ్యాఖ్యలు ఎవరినీ బాధపెట్టే ఉద్దేశ్యంతో చేయలేదు. ఆ మాటల వల్ల ఎవరైనా మనస్తాపం చెందినట్లయితే క్షమించండి" అంటూ ఆమె పేర్కొన్నారు. దీంతో, నాగార్జున కూడా సానుకూలంగా స్పందించి పరువు నష్టం దావా వెనక్కి తీసుకున్నారు . దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న నాగార్జున–సురేఖ వివాదానికి ఫైనల్‌గా తెరపడింది.



# ముంబై గూటికి శార్దూల్

## రూ.2 కోట్ల డీల్‌తో లక్నో నుంచి ట్రేడ్

బలగం టీవీ, హైదరాబాద్





ఐపీఎల్ 2026 వేలానికి ముందు ముంబై ఇండియన్స్ బిగ్ మువ్ చేసింది. స్టార్ పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను తమ గూటికి చేర్చుకుంది. రీటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ, లక్నో సూపర్ జెయింట్స్ తో ట్రేడ్ డీల్ ద్వారా రూ. 2 కోట్ల ధరకు ఈ లావాదేవీ జరిగింది. ఈ ఒప్పందంతో ముంబై పేస్ ఆల్‌రౌండర్ అర్జున్ టెండూల్కర్‌ను వదులుకుంటుందనే ఊహాగానాలకు చెక్ పడింది. "కలల నగరమైన ముంబైకి స్వాగతం లార్డ్!" అంటూ ముంబై ఇండియన్స్ తమ అధికారిక ఎక్స్ అకౌంట్‌లో శార్దూల్ చేరికను ప్రకటించింది.

శార్దూల్ ఠాకూర్ ఐపీఎల్‌లో అనేక ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు పంజాబ్ కింగ్స్, రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్ తరపున ఆడాడు. ఇప్పుడు ముంబై ఇండియన్స్ అతడి ఏడో జట్టుగా నిలిచింది. గత సీజన్‌లో గాయాల కారణంగా లక్నో జట్టులోకి వచ్చిన శార్దూల్, 10 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు సాధించాడు. 11.02 ఎకానమీతో ఆడిన అతడి ప్రదర్శన మిశ్రమంగా ఉండగా, కొత్త సీజన్‌లో ముంబై తరపున కీలక పాత్ర పోషించనున్నాడని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ముంబై ప్రధాన పేసర్ దీపక్ చాహర్ గాయంతో జట్టుకు దూరం కావడంతో, అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు శార్దూల్‌ను తీసుకున్నట్లు తెలుస్తోంది.

# 'అఖండ 2' నుంచి నేడు ఫస్ట్ సాంగ్

బలగం టీవీ, హైదరాబాద్





నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం'అఖండ 2' పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ జంట నుంచి మళ్లీ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కి వంతు దక్కనుందనే ఉత్సాహంతో ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర బృందం తాజాగా భారీ అప్‌డేట్‌ను వెల్లడించింది. సినిమా నుంచి మొదటి పాట విడుదల కు ముహూర్తం ఖరారైంది. నేడు ముంబైలోని జుహూ పీవీఆర్‌లో ఈ పాట విడుదల వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పాటకు సంబంధించిన ఆసక్తికర వివరాలను సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఈ పాటను ప్రముఖ గాయకులు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ కలిసి ఆలపించారని తెలిపారు. "ఈ పాట వింటే నిద్రపట్టదు. ఆ ఎనర్జీ మనలో తాండవం చేస్తుంది. ఇది కేవలం పాట కాదు... శివుడి శక్తి!" అని తమన్ పోస్టు చేయడంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

సినిమా విడుదల సమయం దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని అన్ని మార్కెట్లలో బలంగా ప్రమోట్ చేయాలని నిర్మాతలు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'అఖండ 2' అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని తెలుస్తోంది. ఈ హైప్‌ను నిలబెట్టుకునేందుకు సరైన సమయంలో లిలిటీజర్, ట్రైలర్, ఆల్బమ్‌లిలి రిలీజ్‌లను షెడ్యూల్ చేసినట్లు సమాచారం. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి విడుదల ముందు లిలి'ఓజీ' తరహాలో స్పెషల్ ప్రీమియర్ షోలులిలి నిర్వహించే ఆలోచనలో నిర్మాతలు ఉన్నారని టాలీవుడ్ టాక్.

# 'సగం మంది నన్ను చంపాలని చూశారు.. మిగతా సగం నన్ను కాపాడారు'

## అదా శర్మ సంచలన వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్



విలక్షణమైన కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న నటి అదా శర్మ తనపై ఎదురైన ప్రాణహానికర బెదిరింపుల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023లో విడుదలై దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన చిత్రం 'ది కేరళ స్టోరీ' తర్వాత తాను తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నానని ఆమె వెల్లడించారు. "ఆ సినిమా విడుదలైన తర్వాత దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు. కానీ మిగతా సగం మంది నన్ను రక్షించడానికి ముందుకు వచ్చారు" అని అదా శర్మ తెలిపారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ ఆమె అన్నారు – "రిస్క్‌తో కూడిన పాత్రలే నటుడిని నిలబెడతాయి. నా తొలి చిత్రం '1920' ఒక పెద్ద సాహసం. 'ది కేరళ స్టోరీ' వరకు నేను నిజంగా మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూశాను. ఆ సినిమా నా కెరీర్‌ను పూర్తిగా మార్చింది. ఆ తర్వాత చేసిన 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' సమయంలో కూడా తీవ్రమైన బెదిరింపులు ఎదుర్కొన్నాను," అని చెప్పుకొచ్చారు. తన పాత్రల ఎంపికపై అదా శర్మ స్పష్టంచేస్తూ, "నేను చేసే ప్రతి పాత్రలో భావోద్వేగం, యాక్షన్, లోతైన ఎమోషన్ ఉండాలి. ప్రేక్షకులు చూసి ప్రభావితం కావాలి. నా కుటుంబం కాస్త ఆందోళన చెందేలా ఉండే పాత్రలే నన్ను ఆకర్షిస్తాయి. అలాంటి సవాళ్లు లేకపోతే ఆ పాత్ర ఎందుకు చేయాలనిపిస్తుంది?" అని తెలిపారు. మొత్తంగా కెరీర్‌లో రిస్క్ తీసుకోవడమే తన శైలి అని అదా శర్మ స్పష్టం చేశారు.